తీశారు.. వదిలేసారు..!

ప్రజాశక్తి- పూతలపట్టు: అసలే వేసవిని తలపిస్తూ.. భానుడు భగభగమంటున్నాడు. ఉదయం 10 గంటలు దాటితే ప్రజలు బయట తిరగడానికి ఇబ్బందులు పడుతున్న తరుణం ఆసన్నమైంది. ఎండవేడిని తట్టుకోవడానికి ప్రతి మనిషికి అత్యంత అవసరమైనది తాగునీరు. ఇలాంటి తరుణంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో పది రోజుల క్రితం చేతిబోరు మరమ్మతులు చేయడానికి పైపులు తీసి వదిలేసారు. బోర్‌కు సంబంధించిన సామగ్రి మొత్తం కాలనీలోనే రోడ్డుపై అలాగే ఉండిపోయింది. కాలనీవాసుల ఒత్తిడి తట్టుకోలేక బోరు మరమ్మతులు చేపడతామని వచ్చిన అధికారులు పని పూర్తిస్థాయిలో చేయకుండా తిరిగి గాలికి వదిలేశారు. కాలనీలో నీటి ఎద్దడిని గుర్తించి అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నాకు దిగుతామని కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.

గత పది రోజులుగా రోడ్డుపై పడి ఉన్న చేతిబోరు పైపులు

హెల్మెట్ తప్పనిసరి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చిత్తూరు రూరల్ మండలం, అనంతపురం గ్రామంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి యం.ఎస్.భారతి, కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్, రామకృష్ణ రెడ్డి, కార్మిక అసిస్టెంట్ కమిషనర్ ఓంకార్, గ్రావిటా ఇండియా లిమిటెడ్ జియం.టాటా శర్మతో కలసి హెల్మెట్లను పంపిణీ, హెల్మెట్ వాడకం పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడంతో ఎక్కువ మంది ప్రమాదాల్లో మరణిస్తున్నారని, రోడ్డు ప్రమాదాలలో 90 శాతం ద్విచక్ర వాహనాలు నడిపే వారి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. గ్రావిటా ఇండియా లిమిటెడ్ యాజమాన్యం వారి ఆధ్వర్యంలో ఫ్యాక్టరీలో పని చేసే కార్మికులకు, స్థానికులకు సుమారు 250 మందికి హెల్మెట్‌లు పంపిణీ చేశారు.

మెనూ కచ్చితంగా అమలు చేయాలి

- రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్

ప్రజాశక్తి- యంత్రాంగం: రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి మంగళవారం జిల్లాలోని పూతలపట్టు, బంగారుపాల్యం, పెనుమూరు, ఎస్ఆర్‌పురం, గంగాధర నెల్లూరు మండలాల్లో పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం అమలు చేయాలన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, ఎఫ్‌పి షాపులు, పిహెచ్‌సిలు, అంగన్వాడీ కేంద్రాలు, ఎండియు వాహనాలను తనిఖీ చేశారు.

పూతలపట్టు మండలంలోని ఎర్రజెరువుపల్లి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పూతలపట్టు పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం సంతృప్తిగా ఉందా లేదా అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించడానికి విద్యార్థులు తీవ్రంగా శ్రమించాలని, తల్లిదండ్రుల ఆశయ సాధనకు అడుగులు వేయాలని సూచించారు.

గంగాధర నెల్లూరు మండలంలో అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాల నిర్వహణను తనిఖీ చేశారు. బియ్యం నాణ్యతను పరిశీలించారు. రేషన్, స్కూల్స్, ఐసిడిఎస్‌లకు నాణ్యమైన బియ్యంను అందజేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించి పాలు, గుడ్లు, అధిక విటమిన్, ప్రోటీన్లు కలిగిన ఆహారాన్ని పిల్లలకు అందిస్తుందని తెలిపారు.


అంగన్వాడీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కమిషన్ ఛైర్మన్

ఎస్ఆర్ పురం మండలంలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ 49 కొత్తపల్లి మిట్ట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, దళితవాడలోని అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం ఏపీ రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ ఛైర్మన్ తనిఖీ నిర్వహించారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులను భోజనం ఎలా ఉంది మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా..? అని ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత కావాలని సూచించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కొత్తపల్లి దళితవాడలోని అంగన్వాడీ కేంద్రాన్ని విద్యార్థుల హాజరు పట్టిక, స్టాక్ రిజిస్టర్‌ని పరిశీలించి కిచెన్ గార్డెన్‌ను చూసి టీచర్ దివ్య పనితీరు బాగుందని చిత్తూరు ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి, కార్వేటి నగరం ప్రాజెక్ట్ సిడిపిఓ పద్మ సునందను జిల్లాలో ఇదేవిధంగా స్టాక్ రిజిస్టర్ మెయింటెనెన్స్ చేయాలని ప్రశంసించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈవో వరలక్ష్మీ, డీఎస్ఓ శంకరన్, డిఎం సివిల్ సప్లై బాలకృష్ణ, పలమనేరు లీగల్ మెటరాలజీ సిఐ రమాదేవి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీలు చెన్నయ్య, రబ్బానీ బాషా, ఎస్ఆర్ పురం తహసిల్దార్ లోకనాథ పిల్లై పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మండలంలోని దండువారిపల్లిలోని నిత్యావసర సరుకుల పంపిణీ కేంద్రాన్ని తనిఖీ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని గిరిజన వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. తక్కువ మోతాదులో చికెన్ అందిస్తున్నారని ఫిర్యాదు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేసి గిరిజన పాఠశాల ప్రిన్సిపాల్ మందలించారు.

ప్రశాంతంగా రాయితీ రుణాల ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక కార్యాలయంలో బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ ద్వారా అందించనున్న రాయితీ రుణాల కోసం చేపట్టిన ఇంటర్వ్యూలు మొదటి రోజు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. కార్పొరేషన్ రాయితీ రుణాలు ఇంటర్వ్యూల కోసం నగరపాలక కార్యాలయంలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టింది. మొదటిరోజు 824మంది దరఖాస్తుదారులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇంటర్వ్యూల కోసం నగరపాలక కార్యాలయ ఆవరణలో ప్రత్యేక హెల్ప్ డెస్క్, పది ప్రత్యేక కౌంటర్లు, బ్యాంకర్లతో ప్రత్యేక టేబుల్లు ఏర్పాటు చేశారు. నగరపాలక పరిధిలోని 38 బ్యాంకు బ్రాంచ్‌ల అధికారులు, ప్రతినిధులు కార్యక్రమానికి విచ్చేసి లబ్ధిదారులతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్పొరేషన్ రాయితీ రుణాల కోసం ఇదివరకే ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కాగా బ్యాంకర్లు దరఖాస్తుదారులతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ అవినేని ప్రసాద్ పర్యవేక్షించారు. మేయర్ ఎస్ అముద, డిప్యూటీ మేయర్లు ఆర్ చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి ఇంటర్వ్యూలు సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచనలు చేశారు. నగరపాలక పరిధిలో 26 నుంచి 50 వార్డులు సంబంధించిన దరఖాస్తుదారులకు బుధవారం ఇంటర్వ్యూలు జరగనున్నాయి. 1 నుంచి 25 వార్డులకు సంబంధించి మంగళవారం హాజరుకాని వారు బుధవారం హాజరుకావచ్చని కమిషనర్ తెలిపారు.ఖ

ఇంటర్వ్యూకి వచ్చిన అభ్యర్థులతో మాట్లాడుతున్న నగర కమిషనర్

నిబంధనలు ఉల్లంఘిస్తే

భారీ జరిమానా..

- 1 నుంచి అమలులోకి వచ్చిన నూతన చట్టం
- హెల్మెట్ లేకుంటే రూ.1000 కట్టాల్సిందే..

ప్రజాశక్తి- గుడిపాల: రహదారిపై ఏ విధమైన నిబంధనలు ఉల్లంఘించినా భారీ జరిమానాలు కట్టాల్సిందే. రెండోసారి పట్టుబడితే ఆ జరిమానాలు సుమారు పదింతలవుతుంది. దీంతో సగటు వాహనదారుడు ప్రయాణించేటప్పుడు ఏమాత్రం జాగ్రత్తలు తీసుకోకపోయినా జేబులకు చిల్లుపడటం ఖాయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈనెల ఒకటి నుంచి నూతన మోటారు వాహన చట్టం అమలులోకి వచ్చింది. రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ స్థాయి బాదుడు తప్పదని చెబుతుంది. ఇప్పటికే గత నెల రోజుల నుంచి రవాణాశాఖ అధికారులు రహదారి ఉల్లంఘనలు, జరిమానా చెల్లింపులపై విస్తృత ప్రచారం నిర్వహించింది. హెల్మెట్ ధరించకుంటే జరిగే ప్రమాదాలను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. ప్రస్తుతం రవాణాశాఖ అధికారులు నగరాల్లో అమలు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇక నుంచి పట్టణాలు, పల్లె ప్రాంతాల్లోనూ నూతన చట్టం అమలు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.

మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులదే బాధ్యత..

రహదారులపై మైనర్లు లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులే బాధ్యత వహించాలని నూతన చట్టం చెబుతుంది. డ్రైవింగ్‌పై సరైన అవగాహన లేకుండా వాహనాలు నడిపితే సంభవించే ప్రమాదాలపై రవాణాశాఖ తమ ప్రచారాన్ని విస్తృతం చేసింది. అందులో భాగంగా ప్రతి హైస్కూల్, కళాశాలల్లో దశల వారీగా విద్యార్థులకు రవాణా శాఖ నిబంధనలపై అవగాహన సదస్సులను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నిబంధనలు	జరిమానా నాడు రూ.	జరిమానా నేడు రూ.	రెండవసారి ఉల్లంఘిస్తేరూ.
హెల్మెట్ ధరించకుంటే	100	1000	1000
లైసెన్స్ లేకుండా డ్రైవింగ్	500	10000	10000
రిజిస్ట్రేషన్ లేని వాహనం	1000	5000 (వరకూ)	8000 (వరకూ)
శబ్ద కాలుష్యం	---	1000	2000
మైనర్ డ్రైవింగ్	---	5000	5000
రేసింగ్	500	5000	10000
సెల్‌ఫోన్ డ్రైవింగ్	1000	1500	10000
ట్రిపుల్ డ్రైవింగ్	500	1500	10000
ఆటో డ్రైవర్‌కు డ్రెస్ లేకుంటే	100	200	200

నిబంధనలు ఉలంఘిస్తే జరిమానాలు..

- రామ్మోహన్,ఎస్సై గుడిపాల

నూతన మోటారు వాహన చట్టం ప్రకారం రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు కట్టాల్సిందే. ప్రతి వాహనదారుడు రోడ్డుపైకి వచ్చేటప్పుడు వాహనానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లతో పాటు కచ్చితంగా హెల్మెట్ ధరించాలి. ఒకసారి పట్టుబడితే ఒక విధంగా జరిమానా విధిస్తుండగా మరోసారి పట్టుబడితే ఆ జరిమానా మరింత కఠినంగా ఉంటుంది.

ఆందోళనకు గురి చేస్తున్న సైబర్ క్రైమ్ : ఎంపి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సైబర్ క్రైమ్ ఆధునిక యుగాన్ని ఆందోళనకు గురి చేస్తోందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆన్లైన్ లావాదేవీలకు కూడా దూరంగా ఉండాలని సూచించారు. ఇటీవల సైబర్ మోసాలు పెచ్చు మీరుతున్న నేపథ్యంలో ఢిల్లీ పార్లమెంట్ సమావేశాలలో కూడా ఈ విషయం చర్చకు రావడంతో మంగళవారం చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఢిల్లీలో స్పందించారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో సైబర్ మోసాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. సైబర్ క్రైమ్ మహమ్మారికి ఆజ్యం పోసే మానసిక ఉచ్చులు, హైటెక్ దోపిడీలు, డిజిటల్ మోసాలను బట్టబయలు చేయాలని సూచించారు.

కూటమి ప్రభుత్వంపై ఆర్కే రోజా ఫైర్

చిత్తూరు సబ్ జైల్లోని వైసిపి నాయకులకు పరామర్శ

విలేకరులతో మాట్లాడుతున్న ఆర్కే రోజా

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు సబ్ జైల్లోని వైసిపి నాయకులను మంగళవారం మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైసిపి నేతలపై తప్పుడు కేసులతో అరాచకం సృష్టిస్తుందన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పడ్డాయని, రాష్ట్రాన్ని గంజాయికి అడ్డాగా మార్చారని వాపోయారు. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం ఉన్న గుంటూరులో డ్రగ్స్ విచ్చలవిడిగా దొరుకుతున్నాయని, పుత్తూరులో తెలుగు యువత నాయకులు డ్రగ్స్ విచ్చలవిడిగా సరఫరా చేస్తున్నారని, నగిరి నియోజకవర్గంలో విద్యార్థులు గంజాయి తాగి ప్రధానోపాధ్యాన్ని కాలర్ పట్టుకున్న సంఘటన చోటు చేసుకుందని, కుప్పంలో ఏకంగా గంజాయి సాగు చేస్తున్నారాని ఆరోపించారు. రెడ్ బుక్ రాజ్యాంగం అంటూ రాజ్యాంగానికి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. పోసాని కృష్ణమురళిపై నిబంధనలకు విరుద్ధంగా కేసులు పెడుతున్నారని, పోసాని ఆరోగ్యం సరిలేకపోయిన టార్చర్ పెడుతున్నారని అన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు తిలోదకాలు ఇచ్చి కూటమి నేతలు చెప్పినట్లు అధికారులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల్లోనే అట్టర్ ఫెయిల్యూర్ అయిందని, అందుకు నిదర్శనం ఉత్తరాంధ్రలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఓటమి అని అన్నారు. రాబోయే జమిలి ఎన్నిక లైన, సాధారణ ఎన్నిక లైన వైయస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. వైఎస్ఆర్సిపి మహిళా జిల్లా నాయకురాలు గాయత్రి దేవి, అంజలి పాల్గొన్నారు.

మహిళలకు పోషకాహారం అవసరం

ప్రజాశక్తి- కార్వేటినగరం: మహిళలకు పోషకాలతో కూడిన ఆహారం ఎంతో అవసరమని ఐసీడీఎస్ సీడీపీవో పద్మసునంద అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొల్లాగుంట అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని



మహిళల తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. సీడీపీవో మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, యుక్త వయస్సు బాలికలకు శారీరక వ్యాయామం తప్పనిసరి అన్నారు. మహిళలలో రక్తహీనతను తగ్గించేందుకు పోషకాలతో కూడిన ఆహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ భవనం ఆవరణాల్లో పోషకాలతో కూడిన ఆకుకూరలను పండించి పిల్లలకు అందించాలని సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. పర్యావేక్షకులు శామిని, ఇందిరా, అంగన్వాడి వర్కర్ వళ్లెమ్మ పలువురు పాల్గొన్నారు.

దోమల నివారణకు రసాయనాలు స్ప్రే చేయాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుధారాణి ఆదేశాలతో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం సబ్ యూనిట్ అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించడమై నది. జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ హై రిస్క్ ప్రాంతాలను గుర్తించి రసాయనాలను స్ప్రే చేయించాలని దిశానిర్దేశం చేశారు. కొన్ని ప్రాంతాల్లో నీటి కొరత కారణంగా మూతలేని నీటి నిల్వలతో డెంగు కనిపిస్తున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని లార్వాలు ఉన్న అన్ని ఏరియాలలో స్ప్రేయింగ్ చేపట్టాలని తెలిపారు. అందరు పారామెడికల్ సిబ్బందితో మానిటర్ చేస్తూ అవగాహన కార్యక్రమాలు విపులంగా చేపట్టాలని తెలిపారు.దోమలు పుట్టకుండా, దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు పారామెడికల్ సిబ్బంది ద్వారా గ్రామాల్లో నిర్వహించాలన్నారు. లార్వా నాశిని రసాయనాలను స్ప్రే చేయించాలన్నారు. ఎక్కడైనా పాజిటివ్ కేసి కనిపిస్తే ఆ చుట్టుపక్కల అన్ని ఇండ్లలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ రామచంద్ర రెడ్డి, సబ్ యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాలరావు

మామిడి పంట సస్యరక్షణపై శిక్షణ

ఆర్‌బికే సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి- యాదమరి: మామిడి పంటల సస్యరక్షణ, ప్రత్యామ్నాయ పంటలపై ఆర్బీకే సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు. చిత్తూరు జిల్లాలో మాంగో భవన్‌లో జిల్లా ఉద్యానశాఖ అధికారి ఉద్యాన పంటలకు సంబంధిత శాస్త్రవేత్తలతో కలిసి ఆర్బికే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉద్యాన అధికారి మాట్లాడుతూ మామిడి కొమ్మల కత్తిరింపు చేపట్టి తెగుళ్ళు, పురుగులను సమర్థవంతంగా అరికట్టవచ్చని, పక్వానికి వచ్చిన కాయలను వెంటనే దఫాలుగా కోయడం వల్ల నాణ్యమైన కాయలు, అధిక దిగుబడి లభిస్తుందని తెలిపారు. మామిడి పంటకు సంబంధించి కవర్లను 50శాతం రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ మామిడిలో తేనె మంచు పురుగుకు, తామర పురుగులు నివారణకు పసుపు రంగు జిగురు అట్ట బుట్టలు చెట్లు అన్నింటికీ ఒకే విధంగా ఉంచడం వల్ల నివారించవచ్చని, పండు ఈగ నివారణకు ఎకరాకు 6 నుంచి 8 బుట్టలు వాడడం వల్ల పురుగులను నివారించవచ్చునన్నారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కవిత మాట్లాడుతూ మామిడిలో బూడిద తెగులుకు హెక్సా కొనజోల్ వాడ వల్ల నివారించవచ్చునని అన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ మధుమతి మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటలైన పామాయిల్, చింత, నిమ్మ సీతాఫలం, కోకో, అవకాడో వంటి పంటల గురించి శిక్షణా తరగతిలో వివరించారు. ఏపీ ఎంఐపి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింకర్ల వాడటం వల్ల ఉద్యాన పంటలు పండించి అధిక దిగుబడిని పొందవచ్చున్నారు.

సచివాలయాల్లోనే సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: గ్రామాల్లోని సమస్యలను సచివాలయాల్లోని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్ఆర్ పురం తహశీల్దార్ లోకనాథ పిళ్ళై మంగళవారం కొత్తపల్లి గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. సచివాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలను పరిష్కరించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి సచివాలయంలో వీఆర్వోలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు ప్రజలకు అందుబాటులో ఉండాలని సర్టిఫికెట్లు వంటి చిన్నచిన్న సమస్యలు వస్తే అక్కడే డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేసి పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ ప్రత్యేక చర్య తీసుకున్నారని అందులో భాగంగా సచివాలయాలను బలోపేతం చేస్తున్నారని ఈ విషయాన్ని సిబ్బంది దృష్టిలో ఉంచుకోవాలన్నారు.

పర్యాటక కేంద్రంగా కుప్పం

ప్రజాశక్తి- కుప్పం టౌన్

కుప్పం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని కడా పీడి వికాస్ మరమ్మత్ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం 3 గంటలకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. బుధవారం నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని గుడుపల్లి మండలం మల్లప్ప కొండ ప్రాంతంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. స్థానిక కళలను ప్రోత్సహించడంలో భాగంగా వాహన రైసింగ్ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అలాగే స్థానికంగా లభించే వివిధ రకాల వస్తువుల ప్రదర్శన శాలలను సైతం నిర్వహించనున్నామని తెలిపారు. ప్రజలు, విద్యావంతులు, విద్యార్థులు, యువత పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

అన్నదాతలకు అండగా ఉంటాం..

ప్రజాశక్తి- కుప్పం రూరల్: కుప్పం నియోజకవర్గ పరిధిలోని అటవీ ప్రాంత పరిసరాలలో గల అన్నదాతలకు అండగా ఉంటామని ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం తెలిపారు. రైతు సమస్యల పరిష్కారంకు కంగుంది గ్రామంలో అటవీ శాఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలోని రైతుల పంట పొలాలపై కోతులు, ఏనుగులు, అడవి పందులు దాడి చేయడం తరచూ జరుగుతోందని, పంటలు పండించడం ఒక ఎత్తు అయితే వాటిని అటవీ జీవుల దాడుల నుండి కాపాడుకోవడం మరో ఎత్తుగా మారిందన్నారు. అడవి చుట్టుపక్కల ఉన్న గ్రామాలలోని రైతులు వారి పంట భూములపై అటవీ మృగాలు దాడులు చేయడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నట్టు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి అటవీశాఖ అధికారులు ప్రత్యేక తీసుకోవాలని సూచించారు. జిల్లా అటవీ శాఖ అధికారి భరణి, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అటవీ శాఖ అధికారులతో సమావేశమైన ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు

విద్యార్థులకు ఉచిత దంతవైద్య పరీక్షలు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులోని బంగ్లా స్కూలు విద్యార్థులకు శ్రీపురం సీతారామయ్య నాగమణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ దంత వైద్యశాలలో ఉచితంగా దంత వైద్యపరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరిగింది. దంత వైద్యులు మాట్లాడుతూ విద్యార్థులు రోజుకు రెండుసార్లు తప్పకుండా పళ్ల తోముకోవాలని, తీయటి పదార్థాలు చాక్లెట్లు తిన్నప్పుడు వెంటనే దంతాలను శుభ్రం చేసుకోవాలని ఆహారంను బాగా నమిలి తినాలని సూచించారు.

సిఎంను కలిసిన సర్పంచ్ రీటా ఎల్లప్ప

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని శెట్టిపల్లి గ్రామ పంచాయతీకి చెందిన సర్పంచ్ రీటా ఎల్లప్ప రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పంచాయతీలోని పలు అభివృద్ధి కార్యాక్రమాలు, సంక్షేమ ఫథకాల గురించి వివరించారు. పంచాయతీ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించాలని కోరగా సిఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయన వెంట నియోజకవర్గం యువత అధ్యక్షులు బాలు పాల్గొన్నారు.

సూర్య చంద్ర వాహనంపై ఆదిదేవుడు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: సూర్య, చంద్రప్రభ వాహనంపై ఆదిదేవుడు మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని మొగిలి గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీ కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామికి ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సూర్యప్రభ వాహనంపై విహరించారు. ఉభయదారులుగా నల్లగంపల్లి గ్రామానికి చెందిన కెఎన్ఎన్ ఫుడ్ యాజమాన్యం వారు వ్యవహరించారు. సాయంత్రం ధ్వజావరోహణం, త్రిశూల స్థానం చేపట్టి రాత్రి చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా బంగారుపాళ్యంకు చెందిన రమ్య ప్రదీప్ వ్యవహరించారు. ఆలయ వంశపార ధర్మకర్త విజయ్ కుమార్, ఆలయ కార్యనిర్వహణ అధికారి మునిరాజులు, ఆలయ సిబ్బంది శరవణ లోకనాథం, మధు, అర్చకులు పాల్గొన్నారు.

రజక కుల రక్షకురాలు ఉబ్బమ్మ

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని ధోబి ఘాట్‌లో రజక కుల రక్షకురాలు ఉబ్బమ్మ దేవర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, కూటమి నాయకులు విచ్చేశారు. వీరందరికి రజక కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి ఆర్ మోహన్ ఆధ్వర్యంలో రజక కులస్తులు సాదర స్వాగతం పలికి, అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: తిరుపతి శ్రీ రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీ కోనేటి రామస్వామి ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం 5వ తేదీ బుధవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండల పరిధిలోని ప్రజలు ఎటువంటి ఆరోగ్య సమస్యలున్నా పరీక్షలు చేయించుకోవచ్చు అని, ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వైద్యశిబిరానికి మండలంలోని ప్రజలందరూ పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ పరిధిలోని వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ రెడ్డప్ప పెదనాన్న వెంకటేష్ అనారోగ్యంతో మంగళవారం మరణించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ రవిచంద్రబాబు, మండల వైసీపీ నేతలు అంత్యక్రియలకు ఆర్థిక సాయంగా రూ.15 వేలు అందించారు. మండల ఎంపీపీ మొగసాల రెడ్డప్ప, మొగసాల కృష్ణమూర్తి, ప్రభాకర్ రెడ్డి, దినేష్, రెడ్డప్ప సుబ్రమణి, వెంకటాద్రి, గోవింద, చంద్రప్ప, ఆనంద్, గోపాల్ పాల్గొన్నారు.

మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- పలమనేరు: చిత్తూరు జిల్లాలో ప్రధాన ఉద్యాన పంట అయినటువంటి మామిడి పంటకు మంచి గిట్టుబాటు ధర పలికి మామిడి రైతులు నష్టపోకుండా ఉండాలంటే మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఉమాపతి నాయుడు కోరారు. సీజన్లో ప్రతి ఏటా మామిడి రైతులను వ్యాపారస్తులు జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం వారంతా ఏకమై సిండికేట్‌గా మారి మామిడి రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేసి నిలువునా ముంచేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో మామిడి పరిశ్రమలలో తయారయ్యే పండ్ల జ్యూస్‌లను టిటిడికి దేశ విదేశాల్లో నుంచి వచ్చే భక్తులకు మామిడి జ్యూస్ ప్యాకెట్ల రూపంలో అందజేయడంతోపాటు రాష్ట్రంలో అనేక దేవాలయాలకు, ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్వాడీలకు మధ్యాహ్నం భోజన పథకం ద్వారా పిల్లలకు ఆహారంతో పాటు మామిడి పానీయాలను ప్రభుత్వం ద్వారా సరఫరా చేయడం ద్వారా మామిడి రైతులను ఆదుకోవచ్చు అని తెలిపారు.

తెప్పోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

తిరుమల శ్రీవారి పుష్కరిణివద్ద అధికారులతో మాట్లాడుతున్న తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: తిరుమలలో ఈనెల 9 నుండి 13వ తేదీ వరకు జరగనున్న తెప్పోత్సవానికి సంబంధించి జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు తిరుమల పోలీస్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. టీటీడీ ఇంజనీర్ విభాగం అధికారులతో కూడా మాట్లాడి తెప్పోత్సవానికి సంబంధించి సమన్వయంతో విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులకు సూచించారు. అనంతరం తెప్పోత్సవం జరగబోవు ప్రదేశాలను పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రోప్ పార్టీలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ తెప్పోత్సవానికి గతంలో ఎంత మంది వచ్చారు ఇప్పుడు ఎంతమంది వస్తారు అనే దానిపై ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఉత్సవం జరిగేటప్పుడు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రద్దీలో దొంగతనాల నివారణకు పాత నేరస్తులపై నిఘా పెట్టాలన్నారు. తెప్పోత్సవానికి వస్తున్న భక్తులకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, వారి వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. తిరుమలలో మిస్సింగ్ పర్సన్స్ గురించి, అనధికారంగా నివాసం ఉంటున్న వారి గురించి, స్టాండింగ్ ప్రొసీడింగ్స్ తీసుకోవాలని ఆదేశించారు. వృద్ధాప్యంలో ఉన్నటువంటి వ్యక్తుల డేటా తీసుకుని, మిస్సింగ్ కేసులు ఉంటే పరిశీలించాలని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, క్రౌడ్ కంట్రోల్‌పై తీసుకోవలసిన జాగ్రత్తలును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, వన్ టౌన్ సీఐ విజయ్ కుమార్, ఎస్.ఐ చలపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని రాష్ట్ర రాజధానుల్లో

శ్రీవారి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించండి

➤ ముఖ్యమంత్రలకు టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడు లేఖ

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

దేశంలోని అన్ని రాష్ట్ర రాజధానుల్లో తిరుమల శ్రీవారి ఆలయ నిర్మాణానికి ఉచితంగా స్థలం కేటాయించాలని టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడు ఆయా రాష్ట్ర ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ లేఖలు రాసినట్లు ఆయన మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు మాత్రమే కాదని, సమాజ అభివృద్ధికి దోహదపడతాయని, 'దేశాభివృద్ధిలో టెంపుల్ టూరిజం ప్రత్యేక పాత్ర పోషిస్తుందని, ఆధ్యాత్మిక వైపు అందరూ అడుగులు వేస్తున్నారనని ఆయన ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. ప్రతి రాష్ట్ర రాజధానిలో వేంకటేశ్వరస్వామి ఆలయం ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కోట్ల మంది భక్తులు దేవాలయాలకు విరాళాలు ఇస్తున్నారని, వాటిని విద్య, వైద్యం సహా ఇతర సేవ కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మన సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు దేవాలయాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని ఆయన లేఖలో పేర్కొన్నారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఆళత్తూరు గ్రామంలో విషాదం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శ్రావణ్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - కార్వేటినగరం: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొల్లాగుంట చెకోపోస్టు వద్ద మంగళవారం వేకువ జామున చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఏఎస్ఐ మునికృష్ణ కథనం మేరకు వివరాలు ఉన్నాయి. మండలంలోని ఆళత్తూరు గ్రామానికి చెందిన ఈశ్వర్ ఆచారి, మునెమ్మ కుమారుడు, శ్రావణ్(25) అదే గ్రామానికి చెందిన చెన్నకేశవు (21)తో కలసి సోమవారం రాత్రి మండలంలోని కొల్లాగుంట గ్రామంలో తన స్నేహితుని పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని రాత్రి ఒంటి గంట సమయంలో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఇంతలో కొల్లాగుంట చెక్‌పోస్టు వద్ద శ్రావణ్ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వస్తున్న ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీ కొనడంతో శ్రావణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌లో వెనుక ఉన్న చెన్నకేశవులుకు తీవ్రగాయాలు కావడంతో అతన్ని తిరుపతి రుయాకు తరలించారు. అతని పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. వెనుకవైపు నుంచి ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న వ్యక్తి రంజిత్‌గా గుర్తించామని అతను వాహనాన్ని ప్రమాద స్థలంలో వదలి పరారయ్యాడని అతనికోసం గాలిస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. గత ఆరు నెలల క్రితం శ్రావణ్ స్వగ్రామమైన ఆళత్తూరు గ్రామానికి చెందిన పరందామ ఆచారి కుమార్తె రోహిణి(21)తో వివాహమైంది ఆకస్మికంగా రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందడంతో కన్నీమున్నీరుగా విలపిస్తున్న రోహిణిని చూసి కంట తడిపెట్టని వారు లేరు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శ్రావణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

31 మందికి జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నిత్యబాబు సోమవారం వాహన తనిఖీ చేస్తున్న సమయంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 31 మంది పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో మంగళవారం ఉదయం ప్రవేశపెట్టగా జడ్జి ఉమాదేవి వాహనదారులకు 31 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.3,10,000లు జరిమానా విధించారు.

అలిపిరి నడక మార్గంలో చిరుత

సిసి కెమెరాలో రికార్డయిన దృశ్యాలు
పిల్లిని వేటాడి తీసుకెళ్లిన చిరుత
రాత్రి 10 గంటల తరువాత నడక మార్గం బంద్

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: తిరుమల అలిపిరి మెట్ల మార్గంలో ఆరేళ్ల బాలికను చిరుతపులి చంపేసిన ఘటన తర్వాత కాలినడకన కొండపైకి వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. తరచుగా అలిపిరి నడక మార్గంలో చిరుత పులులు దర్శనమిస్తుండడంతో భక్తులు భయాందోళనలకు గురవుతున్నారు. తాజాగా, మరోసారి మెట్ల మార్గంలో చిరుత కలకలం రేగింది. అర్ధరాత్రి దాటాక ఒంటి గంట సమయంలో గాలి గోపురం వద్ద చిరుతపులి కనిపించింది. అది ఓ పిల్లిని వేటాడి అడవిలోకి తీసుకెళ్లింది. సీసీ కెమెరాల్లో రికార్డయింది. గత రాత్రి తిరుపతిలోని జూ పార్క్ రోడ్డులోనూ చిరుతపులి కనిపించినట్టు తెలిసింది. కాగా, టీటీడీ రాత్రి 10 గంటల తర్వాత నడక మార్గాల్లో భక్తులను అనుమతించడంలేదు. అటు, 12 ఏళ్ల లోపు చిన్నారులను మధ్యాహ్నం 2 గంటల లోపే నడక మార్గంలో తీసుకెళ్లేందుకు అనుమతిస్తున్నారు.

నా వ్యక్తిగత విషయాన్ని రాజకీయం చేయొద్దు : లక్ష్మీరెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం)

మీడియాతో మాట్లాడుతున్న లక్ష్మీరెడ్డి

జనసేన పార్టీ నేత కిరణ్ రాయల్‌కు నాకు ఉన్న ఆర్థిక లావా దేవీలు, వ్యక్తిగత విషయాలను అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయవద్దని లక్ష్మీ రెడ్డి (గతంలో కిరణ్ రాయల్ బాధితురాలు) విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కిరణ్ రాయల్ తన వద్ద నుండి తీసుకున్న నగదును తిరిగి సెటిల్మెంట్ చేసుకుంటున్నానని, ఈ క్రమంలో కొంతమంది యూట్యూబ్ చానల్స్ కు సంబంధించిన వారు తన వ్యక్తిగత విషయాలను ఫోకస్ చేస్తూ అతి దారుణంగా మహిళలని చూడకుండా ప్రాచుర్యం చేయడం బాధ వేసిందన్నారు. ఇక ఈ సమస్యను ఇంతటితో విడిచిపెట్ట దానికి నిర్ణయం తీసుకున్నానన్నారు. మొదట్లో కిరణ్ రాయల్ వద్ద నుండి డబ్బులు తీసిస్తామని ఏడాది క్రితం జనసేన పార్టీకి చెందిన ఓ జిల్లా అధ్యక్షుడు తనకు హామీ ఇచ్చి, కిరణ్ రాయల్‌కు సంబంధించిన సమాచా రాన్ని తన వద్ద నుంచి తీసుకోవడం జరిగింద న్నారు. తను గతంలో ఆత్మహత్య ప్రయత్నంచేసి, ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న సమయంలో కిరణ్ రాయల్‌కు సంబంధించి వచ్చిన వీడి యోలు తాను విడుదల చేయలేదన్నారు. కిరణ్ రాయల్‌తో ఉన్న వ్యక్తిగత లావాదేవీల అంశాలను తన పిల్లలు దగ్గరుండి చూసుకుంటానని చెప్పారని, అందుకనే ఈ విషయాలను ఇంతటితో విడిచిపెడుతున్నానని తెలిపారు. ఏ రాజకీయ పార్టీ నేతలు తన వెనుక లేరని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో గతంలో ఆమె కిరణ్ రాయల్‌పై చేసిన ఆరోపణలను విలేకరులు ప్రశ్నించడంతో కోపోద్రిక్తురాలై మాటలు దాటవేసే సమాధానాలు చెప్పడం గమనార్హం.

మంచి బువ్వ పెడితే..

'పొట్ట కొట్టే కుట్ర'..!

- ఎంఈవో స్థాయి అధికారిపై డీఈఓకు ఫిర్యాదు
- న్యాయం చేయాలంటున్న ఎండీఎం నిర్వాహకులు

ఎండీఎం నిర్వాహకులకు మద్దతుగా ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి : ఒక పాఠశాలతో మొదలైన వారి ప్రస్థానం అనతికాలంలోనే పదహారుకు చేరింది. ' మా పాఠశాలకూ మీరే భోజనం సరఫరా చేయండి ప్లీజ్ ' అంటూ పెద్ద సంఖ్యలో పేరెంట్స్ కమిటీలతో పాటు, ప్రధానోపాధ్యాయుల నుంచి ప్రతిపాదనలు వెల్లువెత్తాయి. కష్టమే అయినా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతోంది మనలాంటి పేదింటి బిడ్డలే కదాని ఒప్పుకున్నారు. ఒప్పుకోవడమే కాదు లాభాపేక్ష లేకుండా, మధ్యాహ్న భోజన నాణ్యతలో రాజీ పడకుండా పౌష్టికాహారాన్ని సరఫరా చేశారు. కలెక్టర్, డీఈవో నుంచి సామాన్యుల దాకా ప్రశంసలందుకున్నారు. వీరిని ఆదర్శంగా తీసుకున్న శ్రీకాళహస్తిలోని పలు ఎండీఎం ఏజెన్సీలు భోజన నాణ్యతను పెంచక తప్పలేదు. ఇదీ ఏఎం పుత్తూరు వేదికగా ఎండీఎం నడుపుతున్న డ్వాక్రా మహిళల స్ఫూర్తిదాయక గాథ. అయితే వీరినుంచీ మామూళ్లు ఆశించిన శ్రీకాళహస్తి విద్యాశాఖలోని ఓ ఎంఈవో స్థాయి అధికారికి ఆశాభంగం కలగడంతో డ్వాక్రా మహిళలపై పగబట్టాడు. తన సమీప బంధువుకు ఎండీఎం ఏజెన్సీని అప్పగించేందుకు కొందరు అధికారపార్టీ నేతలతో చేతులు కలిపాడు. దీంతో తమ పొట్ట కొట్టద్దనీ, మరీ ముఖ్యంగా కమీషన్లకు కక్కుర్తిపడి పేద విద్యార్థులకందాల్సిన పౌష్టికాహారాన్ని దూరం చేయద్దని జిల్లా విద్యాశాఖాధికారికి డ్వాక్రా మహిళలు ఫిర్యాదు చేశారు.

వివరాల్లోకి వెళితే..

శ్రీకాళహస్తి పట్టణంలోని ఏఎం పుత్తూరు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వేదికగా ఇద్దరు డ్వాక్రా మహిళలు 2015లో మధ్యాహ్న భోజన నిర్వహణా బాధ్యతలను తీసుకున్నారు. వారు విద్యార్థులకు అందజేస్తున్న భోజన నాణ్యత గూర్చి పట్టణమంతా చర్చ నడవడంతో పలు ప్రభుత్వ, మున్సిపల్ పాఠశాలల్లో ఎండీఎం నిర్వహణకు వీరికి ప్రతిపాదనలు వచ్చాయి. 16 పాఠశాలల్లో సుమారు 2 వేల మంది విద్యార్థులకు 20 మంది డ్వాక్రా మహిళలు ఏఎం పుత్తూరు వేదికగా మధ్యాహ్న భోజనం వండి పంపేవారు. భోజన నాణ్యతలో డ్వాక్రా మహిళలు ఎలాంటి రాజీ పడకపోవడంతో వీరంతా విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్నారు. జిల్లా కలెక్టర్ సైతం వీరి నిబద్ధతను మెచ్చి ఉత్తమ ఎండీఎంగా ప్రశంసా పత్రం అందజేశారు. దాదాపు పదేళ్లుగా ఎండీఎం పథకంలో తమ స్వలాభాన్ని పక్కన పెట్టి, కేవలం ఉపాధిని మాత్రమే ఆశిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమంటే మాటలు కాదు. అలాంటి మాపై తప్పుడు ఆరోపణలు చేస్తూ శ్రీకాళహస్తి విద్యాశాఖలో పనిచేస్తున్న ఓ ఎంఈవో స్థాయి అధికారి తమ ఏజెన్సీని లాక్కునే ప్రయత్నం చేస్తున్నాడని డ్వాక్రా మహిళలు మండిపడుతున్నారు. ఇప్పటికే తమ వద్ద నుంచి మూడు పాఠశాలలు లాగేసుకున్నారని, మిగిలిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కూడా బెదిరించి గుంజుకునేందుకు కుట్ర చేస్తున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో పాఠశాల నుంచి రూ.10 వేలు మామూలు ఇవ్వాలనీ, కోడిగుడ్లు, బియ్యం, రాగి పిండి నెలనెలా పంపాలని బెదిరిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఎండీఎంపై ఆధారపడి మా ఇరవైమందితో కలిపి మరో ఇరవై మంది మహిళలు ఉపాధి పొందుతున్నారని, ఆ అవినీతి అధికారి వల్ల నలభై మంది డ్వాక్రా మహిళలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఆయనపై తగు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఎండీఎం నిర్వాహకుల పొట్ట కొట్టొద్దు : సిఐటియు

మధ్యాహ్న భోజనం పథకాన్ని నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళల పొట్ట కొట్టొద్దని సిఐటియు నాయకులు సూచించారు. బాధిత డ్వాక్రా మహిళలతో కలిసి స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద మంగళవారం సిఐటియు నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య మాట్లాడుతూ 2015లో అప్పటి మంత్రిగా ఉన్న బొజ్జల గోపలకృష్ణారెడ్డి వీరిని సిఫార్సు చేసినట్లు గుర్తు చేశారు. అయితే గత పదేళ్లుగా ఎలాంటి రాజీలేకుండా ఎండీఎం నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళల పొట్ట కొట్టేందుకు శ్రీకాళహస్తి విద్యాశాఖలో పని చేస్తున్న ఎంఈవో స్థాయి అధికారి కుట్ర చేస్తున్నాడంటూ ఆరోపించారు. మామూళ్ల కోసమే ఇదంతా చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా విద్యాశాఖాధికారి స్పందించి ఆయనపై విచారణ జరపాలని కోరారు. డ్వాక్రా మహిళలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంధం మణి, చుట్టు గురవయ్య, వెలివేంద్రం, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

ఆస్టర్ నారాయణాద్రిలో

క్లిష్టమైన డెలివరీ విజయవంతం

వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్ : ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రిలో క్లిష్టమైన డెలివరీని విజయవంతంగా నిర్వహించినట్టు ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఆర్.సృజన తెలిపారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 44 సంవత్సరాలు వయసుగల మహిళ రక్తం గడ్డలు కట్టడం, బి.పి ఎక్కువగా ఉండడం లాంటి వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ మా దగ్గరకి రావడం జరిగిందని తెలిపారు. ఆమెకు గర్భ సంచి వదులుగా ఉండటం వల్ల కొన్ని కుట్లు వేసి బిగుతుగా చేయవలసి వచ్చిందన్నారు. గతంలో పలుమార్లు గర్భము నిలవకుండా పోయినట్లు గుర్తించామన్నారు. ఆమెకు దాదాపుగా 10 సంవత్సరాల నుండి సంతానం కలగలేదన్నారు. ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో ఈ క్లిష్టమైన డెలివరీ కేసును విజయవంతంగా పూర్తి చేశామన్నారు. నియోనాటాలజిస్ట్ డాక్టర్ సతీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తల్లి, బిడ్డలకు అవసరమైన చికిత్స అందించామని, ఇపుడు క్షేమంగా ఉన్నారని తెలిపారు. ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ వి.సునంద కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లో అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉండడంతో మంచి ఫలితాలు సాధ్యమన్నారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ తమ హాస్పిటల్‌లో పటిష్టమైన తల్లి-బిడ్డ విభాగం ఉందని తెలిపారు. అందరికీ రూ.4999 ప్యాకేజీతో ప్రెగ్నన్సీ నుండి డెలివరీ వరకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. రూ.44000 ప్యాకేజీతో డెలివరీకి కూడా అందిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ఎస్.వి ప్రసాద్, డైరెక్టర్, డాక్టర్ అనంత్ పోజాల, పీడియాట్రిషన్ డాక్టర్ పి. ప్రతిమ, చీఫ్ మెడికల్ సర్వీసెస్, వైద్యులు పాల్గొన్నారు.

అటవీ అధికారుల దౌర్జన్యంపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: డక్కిలి మండలం, మోపూరులో గిరిజనులకు భూములు దక్కాలని కోరుతూ గిరిజన సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఫారెస్ట్ అధికారుల చేసిన లాఠీ చార్జీలో మరణించిన సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని పరామర్శించేందుకు మోపూరు రోడ్డు నుండి ఆల్తూరు పాడు రోడ్డు మీదగా వెళుతుండగా, గిరిజనులను పోలీసు, ఫారెస్ట్, రెవిన్యూ అధికారులు ర్యాలీని అడ్డుకున్నారు. గిరిజనులకు వారితో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఈ ర్యాలీలో పాల్గొన్న సిపిఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ నిరసన తెలియజేసే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. న్యాయంకోసం నిరసన తెలియజేస్తుంటే అడ్డుకోవడం అప్రజాస్వామ్యమన్నారు. మోపూరు గ్రామ పరిధి సర్వే నెంబర్ 1, ప్రభుత్వ భూమిలో గిరిజనులకు ఒక్కొక్కరికి రెండు ఎకరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజకీయ పెత్తందారులు వందలాది ఎకరాలు ఆక్రమణ చేస్తుంటే, వారిజోలికి మాత్రం ఫారెస్ట్ వారు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. గిరిజనులపై దాడులకు పాల్పడడం మానుకోవాలని హెచ్చరించారు. గిరిజనుడిని కొట్టి చంపిన ప్రతాపరెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రెవెన్యూ, పోలీసు వారిదేనన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ట్రాన్స్‌ఫర్ లేకుండా గత 15 సంవత్సరముల నుండి ఇక్కడే విధులు నిర్వహిస్తున్న ప్రతాపరెడ్డిని వెంటనే బదిలీ చేయాలన్నారు. గిరిజనులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం ఆగదని తెలిపారు. ఓట్ల కోసమే గిరిజనులా.. పేదలకు భూములు ఇప్పించేందుకు రాజకీయనాయకులు ముందుకు రారా అని ప్రశ్నించారు. అనంతరం యానాదుల సమక్షమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పెంచలయ్య మాట్లాడుతూ న్యాయపోరాటం చేస్తున్న గిరిజనులకు అందరూ అండగా నిలవాలన్నారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. రైతు కూలీ సంఘం, రాష్ట్ర కమిటీ సభ్యులు వివి రమణయ్య మాట్లాడుతూ గిరిజనులు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని తెలిపారు. అంబేద్కర్ సంఘం నాయకులు ఉదయభాస్కర్ మాట్లాడుతూ గిరిజనులపై దాడులు చేస్తున్న ఫారెస్ట్ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్, టిడిపి ఎస్టీ సెల్ నాయకులు చలపతి, గిరిజనులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME & DOB

I, (OLD NAME) **K BARATHI,** Mother of Army No. 15326973Y, HAV, **PRAKASH REDDY K**, **Post:** Venuthanapalli, **Village:** Kampalli,**Tehsill:** Puthalpattu, District: **Chittoor**. State: **Andhra Pradesh, Pin:** 517112 have changed my Name to (NEW NAME) **K BHARATHI** and my DOB is corrected from **10/07/1964** to **01/01/1970** vide Affidavit Dated 28/02/2025 sworn before Notary C SUDHAKARAN, Chittoor,AP

CHANGE OF NAME & DOB

I, (OLD NAME) **K YAGAVENDRA REDDY,** Father of Army No. 15326973Y, HAV, **PRAKASH REDDY K**, **Post:** Venuthanapalli, **Village:** Kampalli **Tehsill:** Puthalpattu, District: **Chittoor**. State: **Andhra Pradesh, Pin:** 517112 have changed my Name to (NEW NAME) **K YAGAVENDHRA REDDY** and my DOB is corrected from **01/07/1960** to **01/01/1956** vider Affidavit Dated 28/02/2025 sworn before Notary C SUDHAKARAN, Chittoor, AP